



# కోరిక

## ఎగుమామిడి అయోధ్యారెడ్డి

**చుట్టూ** సందడి.

రొద చేస్తూ వస్తూ, పోతున్న బస్సులు. హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్న ప్రయాణికులు. వాళ్ళు మాట్లాడుకునే మాటల రణగొణ ధ్వనులు.

బస్టాండు పరుకున్న చౌక డిపోలా కోలాహలంగా ఉంది. ఆ వూళ్ళోకి కొత్తగా ఎవరైనా సరి అడుగు పెడితే... మొట్టమొదట గా వారిని ఆకర్షించేది... బస్టాండే.

కొత్తగా ఆధునిక పద్ధతిలో కట్టారు దాన్ని. రోడ్డురవాణా శాఖ మంత్రిగారితో అట్టహాసంగా ఇటీవలనే ప్రారంభించబడిం దది.

ఒక్కో ప్లాటు ఫారాని కెదురుగా అందమైన బోర్డులు. వాటి మీద తాటికాయంత అక్షరాలతో రాసున్న నెంబర్లు. ప్రయాణికులు విశ్రాంతిగా కూర్చోడానికి వేసిన మెత్తటి సోఫాలు. ఇంకా ఏయే బస్సు ఎటు వెళ్ళేది తెలియ పరిచే అనౌన్స్‌మెంట్లూ.

ఈ హంగామా అంతా మొదట్లో చాలా మందిని ఉక్కిరి బిక్కిరి చేసింది. ఎందుకంటే ఆ పట్టణానికి చుట్టుపక్కల ఉన్నవి అన్నీ పల్లెటూళ్లే. ప్రయాణికుల్లో ఎక్కువ శాతం ఆ పల్లెటూర్ల నుండే వస్తుంటారు.

ఈ ఆధునిక పద్ధతి గల బస్టాండు మొదట్లో వారికి విచిత్రంగానూ, ఏదో కొత్త ప్రపంచం లోకి అడుగు పెట్టినట్లుగానూ అనిపించినా— తరవాత తరవాత రోజులు గడుస్తున్న కొద్దీ ఈ వాతావరణం మామూలైపోయింది.

అటువంటి సమయంలో—

అవన్నీ విపరీతంగా ఆకర్షింప చేస్తూ. మరో కొత్త వస్తువు ఆ బస్టాండ్ లోకి తీసుకు రాబడింది.

అది తూకమూ, ఆ దృష్టమూ చూపించే యంత్రం.

బస్టాండు మధ్యలో రంగు రంగుల బల్బులతో కన్నులకు విందు చేస్తూ వెలిగి పోతూంది.

వారం రోజుల నుండీ ఆ యంత్రానికి విపరీతమైన గిరాకీ. ఒకరి కంటే ఎక్కువగా మరొకరు పోటీలు పడి తమ బరువు చూసుకుంటున్నారు.

బరువు చూసుకున్నందు వల్ల కలిగే ప్రయోజన మంటూ ఏమీ లేకపోయినా, అందరిలోనూ అదో విధమైన ఉత్సాహం.

బస్టాండులో ఒక మూలగా స్తంభా న్నానుకు నిలబడి, ఆ యంత్రం కేసే చూస్తున్నాడు వెంకటి.

వా డలా చూడటం రెండ్రోజుల బట్టి జరుగుతూంది. మొదటి రోజు వాడి కేమీ అర్థం కాలేదు. రాక్షసి లాగా ఉన్న ఆ యంత్రా న్నెక్కి నిలబడి అందరూ దాంట్లోకి డబ్బు లెందు కేస్తున్నారో వాడికి తోచలేదు.

తరవాత వాడి కర్థమైంది. అది బరువు తూచుకునే యంత్రమనీ, పది పైసలు దాని కుండే కన్నం గుండా లోపలకు వేస్తే మన బరువెంతో చిటికెలో కొల్చి అట్టముక్క మీద అచ్చు గుద్ది ఇస్తుందనీ.

ఈ విషయం తెలియగానే వెంకటిలో ఉత్సాహం ఎక్కువైంది. ఎంత సేపైనా కదల కుండా నిలబడి ఆ యంత్రం కేసే చూస్తుండి పోయాడు.

చుట్టూ గుంపు.

ఎంత సేపు చూసినా ఆ గుంపు తరగటం లేదు. వెంకటి కళ్ళకి యంత్రం తాలూకు పూర్తి ఆకారం కనిపించడమే లేదు. ఏదో విమాన మెక్కినంతగా సంబరపడి పోతున్నారు దాని చుట్టూ చేరిన వాళ్ళంతా.

వెంకటి ఆశగా చూస్తున్నా డటు వైపు వాడి వయసు పదేళ్ళు. వాడికూ్కడా తన బరువెంతో చూచుకోవాలనే ఉబలాటం మనసు నిండా అలుముకు పోయింది. కాని, వెంకటి దగ్గిర డబ్బు ల్లేవు. అవి లేకపోతే బరువు చూచుకునే అవకాశం లేదు.

పది పైస లడుక్కోవడానికి వెంకటి తండ్రి బతికి లేడు. తల్లి ఉంది కాని, ఆమె దగ్గిరుండవని.

వాడికి తెలుసు.

వెంకటి తల్లి దొరికిన నాడు కూలి కెళుతుంది. కొందరి ఇళ్ళలో అంట్లు తోముతుంది. బట్ట లుతుకుతుంది.

వెంకటి తల్లి రోజూ వండదు. రోజూ వంట చేసేటంత కూలీ ఆమె సంపాదించదు. ఒక్కొక్క రోజు తాను పనిమనిషిగా ఉన్న ఇండ్లలో దొరికిన పాచి మెతుకులే కొంగున మూట కట్టి తెస్తుంది. అదే పిల్లలకు పెడుతుంది. అదికూడా దొరకని నాడు పస్తు పడుకోవాలిసిందే.

వెంకటికి ఇద్దరు చెల్లెళ్ళూ, ఒక తమ్ము డున్నాడు.

ఆ వేళ మధ్యాహ్నం రెండు గంటలప్పుడు.

బరువు తూచుకునే యంత్రం ముందు జనం ఎక్కడి వాళ్ళక్కడ వెళ్ళి పోయాక, వెంకటి మెల్లగా యంత్రాన్ని సమీపించాడు. కాస్సేపు దాన్ని దగ్గరనుంచి చూస్తూ నిలబడ్డాడు.

ఒకసారి దాన్ని ముట్టుకున్నాడు. చేత్తో మృదువుగా తడిమి చూశాడు చాలా చోట్ల. వాడికి చాలా సంతోషం కలిగింది. ఉత్సాహం పట్టలేక దానిమీద నిలబడ్డాడు.

వాడికి ఆశా భంగమైంది.

యంత్రం పని చెయ్యలేదు. దాని ముడుపు చెల్లించనిదే అది పని చెయ్యదు. అట్లాగే దాని కేసి చూస్తుండి పోయాడు.

"అరేయ్ పోరడా! ఎవ్రడా నువ్?"

కింద గచ్చూడుస్తున్న స్వీపరొకడు గద్దించడంతో ఉలిక్కిపడ్డాడు వెంకటి.

"దానిమీది కెక్కిన నేంది బే!"

"వూరికనే ఎక్కిన" భయపడుతూనే జవాబిచ్చాడు వెంకటి.

"వూర్కినేఎక్కితే బరువు సూపిత్తదనుకొన్నావ్ర. పది పైసలు కావాలె. నీ దగ్గరున్నాయ్ర."

కున్నావ్ ర. పది పైసలు కావాలె. నీ దగ్గరున్నాయ్ర."

"పైసలు నా దగ్గర్ల లెవ్వు."

"మరెందు కెక్కినవ్ రా! మిషిన్ నీ బాబుగాడి దనుకున్నావ్రా? దిగు. దిగు," దగ్గరగా వచ్చి వెంకటిని కిందకు గెంటేస్తూ చీదరించు కున్నా డా స్వీపరు.

దూరంగా వెళ్ళి పోయాడు వెంకటి. వాడి మనసు నిండా దిగులు కమ్ముకుంది.


ఆ దిగులు స్థానే క్రమంగా వాడిలో పట్టుదల బయలు దేరింది. ఎట్లాగైనా సరే! పది పైసలూ సంపాయించి బరువు చూచుకోవాలని నిర్ణయించుకుని, ఇంటి కేసి బయలు దేరాడు.

● ● ● ●

వెంకటికి ఇగని చీకాగ్గా ఉంది.

చంకలో తమ్ముడు అదే పనిగా గుక్క పట్టి ఏడుస్తున్నాడు. వాణ్ణి సముదాయించడానికి నానా విధాలా ప్రయత్నం చేశాడు. అయినా వాడు ఏడుపు మానలేదు.

వాడి కేదన్నా తినడానికి పెడదామన్నా. ఇంట్లో ఏమీలేదు. తల్లి కూలికి పోయింది. వచ్చే వేళకూడా అయింది. పెద్ద చెల్లెలు ఇంట్లో ఉంది. తల్లి వచ్చేలోగా పొయ్యి అంటించే ప్రయత్నంలో.




చిన్న చెల్లెలు లేదు. బయట ఎక్కడో ఆడుకోవడానికి వెళ్ళినట్లుంది. తమ్ముని అట్లాగే చంక నెట్టుకుని వీధి గుమ్మంలో కొచ్చి నిలబడ్డాడు వెంకటి.

బజారమ్మట అడపా దడపా వెళుతున్న సైకిళ్ళను, రిక్షాలనూ చూస్తూ తమ్ముడు ఏడుపు ఉధృతం తగ్గించేశాడు.

తన స్నేహితులైన హనుమంతూ, నారిగాడూ, రంగడూ ఉత్సాహంగా ఎటో వెళుతూ కనిపించారు వెంకటికి.

"అరేయ్ నారిగా! యాడికిరా పోతన్నరు?" కేక వేసి ప్రశ్నించాడు వెంకటి.

వాళ్ళంతా కేక విని ఇటు చూశారు. అందులోంచి నారిగాడు ముందు కొచ్చి—"రేయ్ ఎంకటీ! మన రంగడు బరువు సూశుకొంటడట! మేమంత బస్సుల స్టాండుకు పోతన్నం" అన్నాడు ఎంతో ఉత్సాహంగా.

"మరి పైస లున్నయా రంగని దగ్గిర?" వాళ్ళంతా వూరికే వెళ్ళి, నిన్న తనను తిట్టి గెంటేసిన స్వీపరు చేత తిట్లు తిని వస్తారేమోనన్న ఆలోచన కలిగి ప్రశ్నించాడు వెంకటి.

"ఓ! ఉన్నాయి. ఇయ్యాళ వూరి కెళ్ళి మా మామొచ్చిండు. నాకు పావుల పైస లిచ్చిండు." బరువు చూచుకోబోయే రంగడు సంతోషంగా అన్నాడు.

వెంకటికి బాధ కలిగింది. బాధ కన్నా ఎక్కువగా ఈర్ష్య పడ్డాడు మనసులో. చంకలోంచి జారిపోతున్న తమ్ముణ్ణి పైకి లాక్కుంటూ మవునంగా ఉండిపోయాడు.

"వెంకటీ! నువ్వొస్తవా?"

"నేను రాను! మా తమ్ముని ఎత్తుకు నేతందుకు ఎవ్వల్లేరు."

వాళ్ళంతా ముందు కెళ్ళి పోయారు. ఇంక అక్కడ నిలబడకుండా వెంకటి కూడా వెను దిరిగి గుడిసెలోకి నడిచాడు.

తమ్ముని కింద దించి ఆలోచనలో పడిపోయాడు. తన తోటి సోపతిగాళ్ళంత బరువు సూస్కుంటరు. తనొక్కడే మిగిలిండు! వారం దినాల్సంచి ఎన్ని తిప్పలు పడ్డా. పది పైసలు దొర్కుత లెవ్వు. ఏం జెయ్యాలె? రంగనిదే అదృష్టం. వానికి మామ ఉన్నడు. పావుల పైస లిచ్చిండట.

మరి తనకో! తన కెవ్వలు లేరు.

ఏ విధంగా చూసినా తనకి పది పైసలు దొరికే అవకాశం కనిపించ లేదు వెంకట్‌కి.

వెంకటి ఆలోచనలు తెగిపోయాయి.

లోపల నుంచి ఏదో ధన్ మనే చప్పుడు వినిపించింది. ఉలిక్కి పడి తమ్ముని కోసం చూశాడు. వాడక్కడ లేడు.

ఆతృతగా లోపలకు పోయిన వెంకటి అక్కడి దృశ్యం చూసి భయాందోళనలతో కంపించి పోయాడు.

తను కింద దించిన తమ్ముడు పాకుతూ ఎప్పుడు లోపల కెళ్ళాడో తెలీదు కాని, మూలనున్న మట్టి కుండల దొంతరని కింద పడేశాడు.

ఉన్న మూడు కుండల్లో బరువుగా ఉన్నవి రెండు పగిలి పోయాయి.

ఒక దాంట్లో ఉన్న కాసిని నూకలు, రెండో దాంట్లో ఉన్న ఉప్పు. నేలమీద చిందర వందరగా కలిసిపోయాయి.

తమ్ముడు అమాయకంగా నవ్వుతూ వెంకటి కేసి చూస్తున్నాడు.

వాడు సృష్టించిన భీభత్సం చూసిన వెంకటి నోట మాట లేకుండా నిలిచి పోయాడు. వాడి కళ్ళ ముందు తల్లి ఉగ్ర రూపం దర్శన మిచ్చి గుండె గుబేల్ మంది.

కోపంతో తమ్ముని రెండు చరుద్దా మనుకున్న వెంకటి ఆగిపోయాడు. వాడి కళ్ళెందుకో చురుగ్గా మెరిశాయి. రెండడుగులు ముందు కేసి, నూకల మధ్యనుంచి దొర్లిపడిన పావలా నాణెం చటుక్కున అందుకున్నాడు.

తొందర తొందరగా పడిపోయిన నూకల్ని ఒక చోట చేర్చాడు. వెంకటి మట్టి పెంకుల్ని ఏరి బయట పారేశాడు.

అప్పుడే బయటనుంచి వచ్చిన చెల్లెలికి తమ్ముని అప్పగించేసి ఉత్సాహంగా బయటకు నడిచాడు.

ఎన్ని రోజులు గానో తన మనసులో ఉన్న కోరిక ఆ సమయంలో తీరబోతున్నందుకు అమిత సంతోషంగా ఉన్నాడు వెంకటి.

తొందరగా నడిచి బస్టాండు చేరుకున్నాడు. యంత్రం దగ్గరగా నడుస్తూ అటూ ఇటూ చూశాడు. తను ఇదివరలో కిందకు గెంటేసిన స్వీపరు కనిపిస్తాడేమోనని.

అతడి జాడ కనిపించలేదు. ఇప్పుడతను కనిపించినా ఫరవాలేదు. వెంకటి వద్ద పది పైసలున్నాయి. అదే వాడి ధీమా.

వెంకటి యంత్రం ముందు గద్దెమీద నిలబడ్డాడు. వాడికి ఏదో గెల్చినంత సంబరం కలిగింది. ఒకసారి గర్వంగా తల తిప్పి. బస్టాండులో అందరికేసీ చూశాడు.

తరవాత, పది పైసల బిళ్ళ తీసి. డబ్బు లేసే కన్నంలో మెల్లగా వేశాడు.

యంత్రంలో ఒక్కసారిగా కదలిక వచ్చింది. 'బర్ర్. ర్'. న శబ్దం చేసిహఠాత్తుగా ఆగిపోయింది.

ఉత్సాహంగా చూస్తున్న వెంకటి తెల్లబోయాడు. అట్టముక్క బయటకు రాలేదు. అది వచ్చే స్థలంలో వేలు దూర్చి చూశాడు కాని, లేదు.

వెంకటి నీరుగారి పోయాడు.

జేబులోంచి మరో పది పైసల బిళ్ళ తీసి కన్నంలో వేశాడు. ఈ సారి వెంకటి ఆరాటాన్నీ, ఆశనీ. మొదలంటా నరికేస్తూ అసలు యంత్రంలో కదలికే రాలేదు.

వేసిన పది పైసల బిళ్ళని మింగేసి గుట్టు చప్పుడు కాకుండా ఉండిపోయింది యంత్రం.

వెంకటికి ఏం చెయ్యాలో తోచలేదు. ఏడుపొచ్చినంత పనైంది. రాయిలా నిలబడి పోయాడట్లాగే.

"రేయ్ పోరడా! ఏమలా గాడి కెక్కి నిలవడ్డ వేందిరా! దిగు. దిగు."

చీపురు చేత బట్టుకున్న స్వీపరు గద్దిస్తూ వచ్చాడు.

వెంకటి ఉలిక్కి పడి యంత్రం మీంచి దిగాడు.

"మిషిన్ల. ఇరువై పైస లేసిన! అట్టముక్క రాలే." అన్నాడు స్వీపర్ వంక చూస్తూ.

వెంకటి వంక పిచ్చోడి కేసి చూసినట్లుగా జాలిగా చూశాడు స్వీపరు. తరవాత అన్నాడు.

"ఎవల్నడిగి ఏసినవ్‌ర, ఎర్రి ముండ కొడుక! కరంటు లేంది కనపడ్త లేదుర. మిషిన్ల బుగ్గలు వెలుగునప్పుడు పైస లెందు కేసినవ్? పో. పో ఇక్కణ్ణుంచి."

వెంకటికి దిగులుతో ఏడుపు ముంచు కొచ్చింది. యంత్రం కేసి చూశాడు. నిజమే! అందులో లైట్లు వెలగటం లేదు.

తన ఇరవై పైసల్ని మింగి, ఇంకా తన కేసి నోరు తెరుచుకుని చూస్తున్న రాక్షసిలా కనిపించింది వెంకటి కా యంత్రం.

దిగాలుగా కాళ్ళీడుస్తూ కొంప చేరుకున్నాడు వెంకటి

వాడు చేరేసరికి, గుడిసె లోపలనుంచి చెల్లెళ్ళు బిగ్గరగా ఏడుస్తున్న ధ్వని వినిపించింది

వెంకటి లోపలకు పోయాడు.

వెంకటిని చూసి ఇంకొంచెం బిగ్గరగా ఏడిచారు వాళ్ళు.

ఏం జరిగిందని అడగబోతూ ఆగిపోయాడు వెంకటి.

లోపలినుంచి తల్లి కోపంగా అంటున్న మాటలు వినిపించాయి—

"దొంగ ముండలు మూరెడు లేరు కొలిస్తే. పావులాలకు పావులాలే మాయం జేస్తరు. గింత ధయిర్నమా మీకు? జమీందారు బిడ్డలై పోయింద్రు. వాడు. ఎంకటి గాడు, యాడ జాయిండో! మా రాక్షై పోయిండు. రాని. మక్కె లిరుగ్గొడుతా."

వెంకటికి అంతా అర్థమైంది.

తను తీస్కపోయిన పావుల పైసల కోసరం అవ్వ చెల్లెండ్రను కొట్టి పట్టుకున్నది. గా పైసలు దొంగతనం జేసింది తను! పాపం. దెబ్బలు మాత్రం వాళ్ళు తిన్నరు.

వెంకటికి చెల్లెళ్ళ మీద జాలి కలిగినా, తల్లి కోపం భయం కలిగించింది. ఆ డబ్బు తానే తీశాడన్న సంగతి మాత్రం చెప్పలేక పోయాడు.

నిక్కరు జేబులో మిగిలిన ఐదు పైసల్ని తడుముతూ, చప్పుడు కాకుండా ఒక మూల కూర్చుండి పోయాడు.


# బాదల్ ఫ్యానులు

10 సం॥ సర్వీస్ గ్యారంటి

మీ ఇంటి చూరునుండి చిరుగాలుల చిందులకు







ప్రముఖ ఫ్యాన్ డీలర్లందరివద్ద లభించును

Jaisons/AMA/16/84 TEL